


సూర్యనారాయణ ఆఫీసు నుంచి యింటికి నడుచుకుంటూ వచ్చేసరికి ఆరు దాటింది. ఇంట్లోకి వస్తూనే చిరాగ్గా ఆఫీసు ఫైళ్ళను టేబిలుమీదకు గిరవాటువేసాడు. ఛీ! వెధవబతుకు. గానుగెద్దులా ఎప్పుడూ చాకిరీ చేస్తూండవలసిందే. ఉదయం నుంచి సాయంత్రం వరకు వంచిన తల ఎత్తకుండా చేసినా పని తరిగిండికాదు. ఆ కాగితాలను రేపు ఉదయం పదిన్నరకల్లా తయారుచేసి సిద్ధంగా వుంచాలని ఆఫీసరుగారు ఆర్డరు జారీ చేసారు. వారి మాటకు తిరుగులేదు. అది సుగ్రీవాజ్ఞ. అతనిచ్చిన గడువు పూర్తయేలోగా పని చేయకపోతే అతని కోపానికి అంతూపొంతూ వుండదు. నోటి కొచ్చినట్టల్లా చెడామడా తిడతాడు. తిట్టిన తిట్టు మళ్ళీ తిట్టకుండా అదేపనిగా తిట్టగలిగే విద్య ఎక్కడ నేర్చుకున్నాడో! అతనలా తిడుతూవుంటే — తనకి మాత్రం భూమి అట్టడుగు పొరల్లోకి కూరుకుపోతున్నట్టుంటుంది. అంత అర్జంటు కాగితాలయితే నాల్రోజులు ముందుగా తన ముఖాన తగలెయ్యకూడదూ? ఉహూఁ! ఆఖరి క్షణంలో తలమీదకెక్కి తైతక్కలాడతాడు.

'ఈ ఉద్యోగం నేను చెయ్యలేను' అనిపించింది సూర్యనారాయణకి. అతనలా అనుకోవడం ఎన్ని వందలసార్లో?

విసుగ్గా నిట్టూర్చి బట్టలు మార్చుకున్నాడు. పెరట్లోకి వెళ్ళి కాళ్ళు చేతులు కడుక్కుని గదిలోనికొచ్చేడు.

ఎంతసేపు చూసినా సీత వంటింట్లోంచి బయటకి రాలేదు. ఏం చేస్తోంది లోపల? 'సీతా! ఉత్తరాలేమయినా వచ్చేయా?' అని అరిచాడు. అంటే, 'కాఫీ చేసావా? తెచ్చివ్వవేం?' అని అర్థం.

'ఉత్తరాలేం లేవండీ' వంటింట్లోనుంచే సీత సమాధానమిచ్చింది. అంటే, కాఫీపొడి నిండుకుందని అర్థం. ఇవాళ యింక తనకి కాఫీ తాగే ప్రాప్తం లేదని తాత్పర్యం. తన బతుక్కి ఏదిమాత్రం సవ్యంగా జరిగింది!

సూర్యనారాయణ నిట్టూర్చి ఫైళ్ళు ముందు వేసుకుని కూచున్నాడు.

పనిమీద ధ్యాస నిలవటంలేదు. అతని మనసు మనసులో లేదు ఏవో ఆలోచనలు చుట్టుముడుతున్నాయి. చదువుతున్న విషయం తలకెక్కటం లేదు. ఆఫీసుకి శలవు పెట్టెయ్యాలి. నెల రోజులు సిక్ లీవు పెట్టేస్తేనో? శలవు పెట్టి మాత్రం ఏంచేస్తాడు! ఇంట్లో గోళ్ళు గిల్లుకుంటూ కూచోవాలి. వూరికే కూచుంటే సమస్యలు ఈగల్లా చుట్టుముట్టి మరింత బేజారెత్తిం చేస్తాయి. పనిమీద దృష్టి నిలపలేక ఆఫీసులో తిట్లు తినేకన్నా అదే నయమేమో?

సూర్యనారాయణకి విసుగ్గా వుంది. కలం మూసి కుర్చీలో చేరబడి కళ్ళు మూసుకున్నాడు. తల నొప్పిగ వుంది. మెదడంతా భారంగా వుంది. లేచి, గదిలోకి వెళ్ళాడు. తన పాత రేకుపెట్టె దగ్గర కూచున్నాడు. జంధ్యానికి కట్టిన తాళం చెవితో పెట్టికి వేసిన కప్ప తెరిచాడు. పెట్టె మూత తీసి బట్టల అడుగున దాచిన ఉత్తరాన్ని బయటకి తీసాడు. ఓసారి మనసులో చదువుకున్నాడు. ఉత్తరం చదువుతూవుంటే అతనికి ఒంట్లో సన్నని వణుకు మొదలయింది. శరీరమంతా సన్నగా చెమట్లు పట్టాయి. గుండె దడదడలాడింది. మెదడు వేడెక్కిపోసాగింది ఉత్తరం మడిచి మళ్ళీ బట్టలక్రింద పెట్టి రేకుపెట్టె మూత మూసి తాళం వేసాడు.

బెంగుళూరు నుంచి వచ్చిన ఆ ఉత్తరం అందుకుని మూడు నెలలయింది. చదువుతూనే నీరు కారిపోయేడు. మళ్ళీ మళ్ళీ చదివి నీరసంతోనూ, భయంతోనూ నిస్సత్తువగా కూలబడిపోయేడు. ఎన్నో ఆశలు పెట్టుకుని ఆ ఉత్తరం కోసం ఎదురుచూసేడు తను. తీరా ఆ ఉత్తరం వచ్చి తనమీద విద్యుద్ఘాతంలా పని చేస్తుందని ఊహించలేకపోయాడు. ఆ దెబ్బనుంచి చాలాసేపటి వరకూ తేరుకోలేకపోయాడు. వెంటనే మూడు వందలు పంపించమని అందులో వ్రాసివుంది! పంపించలేకపోతే జరుగబోయే పరిణామాన్ని ఊహించుకుంటే తనకు ఊపిరాడదు. అత్యవసరంగా ఆ డబ్బు పంపించితీరాలి.

తను ఆ డబ్బు పంపించకపోతే — సముద్రాలు తిరగబడకపోవచ్చు. కుల పర్వతాలు బ్రద్దలైపోకపోవచ్చు. నదీనదాలు అల్లకల్లోలం కాకపోవనూ వచ్చును... కాని... కాని... అంతే! తను డబ్బు పంపించితీరాలి! డబ్బు పంపించడానికి కేవలం పది రోజులు గడువుంది...

ఆ గడువుని తను వినియోగించుకోలేకపోయాడు... అంతకన్నా ఆ వ్యవధి తనకి చాలలేదనడం సబబేమో!

డబ్బు కోసం తిరగని చోటులేదు. అడగని పరిచయస్థుడు మిగల్లేదు. పెద్దమ్మాయి గౌరికి పెళ్ళి చేసి యింకా సంవత్సరం తిరగలేదు. దాని పెళ్ళి కోసం చేసిన అప్పులో యింకా పైసా చెల్లుబెట్టలేదు. ఆఫీసులో తెచ్చిన అడ్వాన్సులూ అవీ అలాగే వున్నాయి.

ఈ పరిస్థితుల్లో మూడొందలు ఎలా తేగలడు తను? భార్య మెడలో నల్లపూసలు తప్ప ఏం మిగల్లేదు. అనుకున్న గడువు పూర్తయేలోగా డబ్బు సంపాదించలేకపోయాడు తను. అందువల్ల జరిగే విపత్తును తలచుకుని నిలువునా కంపించిపోతూవుంటాడు. డిశంబరు పదిహేనవ తేదీ!... ఆ విషయం గుర్తొచ్చినప్పుడల్లా సూర్యనారాయణకి గొంతు తడారిపోతుంది.

అప్పటినుంచీ సూర్యనారాయణ అదోమాదిరిగా తయారయేడు. అతనలా యెందుకు మారిపోయేడో యింట్లోవాళ్ళకి కానీ, ఆఫీసులో తోటి ఉద్యోగస్తులకుకానీ ఎవరికీ అంతుబట్టడంలేదు.

'మన సూర్యనారాయణగారు వున్నట్టుండి యిలా మారిపోయారేం! హఠాత్తుగా ఏం వుపద్రవం వొచ్చిపడింది?' అని అంతా ముక్కుమీద వేలు వేసుకున్నారు.

'మునపటి మనిషి కాదీయన' అని సీత కళ్ళు ఒత్తుకుంటూ చాలాసార్లు బెంగగా అనుకుంది.

ఇక పిల్లల సంగతి సరేసరి. రెండోవాడు రవీంద్ర పదోతరగతిలోని కొచ్చేడు. లోగడ ఏది కావాలన్నా తండ్రిని ధైర్యంగా, చనువుగా అడగ్గలిగేవాడు. ఇప్పుడు పరీక్ష ఫీజుకి డబ్బు లడగడానికే బెదిరిపోతున్నాడు.

రవీంద్ర తరువాత ఆడపిల్ల. పేరు కాంతి. ఆడపిల్లకి సూర్యనారాయణ దగ్గర బాగా చేరిక. కాని ఈమధ్య తండ్రి వాలకం చూసి భయంతో తగ్గి వెనుకనే జంకుతూ తిరుగుతోంది. తననుకున్నదానిని ఏడ్చి గీపెట్టి సాధించుకునే తత్వంగల ఆ పిల్ల ఇప్పుడు కిక్కురుమనటంలేదు.

ఆఖరివాడి పేరు సత్యశ్రీనివాసు. వాడికి తండ్రి మూడ్స్ చూసి భయపడే వయసు రాలేదు కానీ, ఎప్పుడూ తండ్రి కోపంతో చిందులువేస్తూ




బాధ పెట్టే డొల్ల అయిన పన్ను పాడైపోయిన పన్ను. వీటి నుంది తప్పించుకోవాలంటే, పిప్పి పళ్ళు కాకుండా చూసుకోవాలి. దాని కోసం, మీ పళ్ళకు బినాకా ఫ్లోరైడ్* రక్షణ యివ్వండి.

ప్రపంచమంతా చేసిన పరీక్షల వల్ల రుజువైంది—పిప్పి పళ్ళు రాకుండా నిరోధించే విధంగా పళ్ళను గట్టి పరచేది, టూత్‌పేస్ట్‌లో గల ఫ్లోరైడ్ అనే పదార్థం మాత్రమే—పంటి ఎనామెల్‌తో యదార్థంగా కలిసి పనిచేసే పదార్థం యిదే అని. బినాకా ఫ్లోరైడ్‌లోని 'ఎక్కువ కాలం నిలిచే' ఫలితం, పిప్పి పళ్ళ ప్రభావాన్ని పెరగకుండా చేసే క్రిములను అరికట్టి బాధ కలిగించే పంటి డొల్లల్ని నిరోధిస్తుంది.

*అన్నిటికన్న అధిక ఫలితాన్నిచ్చే ఫ్లోరైడ్ కాంపౌండ్, మోనోఫ్లోరోఫాస్ఫేట్ దీనిలో వుంది.



సిబా-గాయగీ

గట్టి పళ్ళ కోసం, పిప్పి పళ్ళు రాకుండా నిరోధించటం కోసం—

బినాకా ఫ్లోరైడ్

అగ్రశ్రేణికి చెందిన భారతదేశపు,
ప్రభావంగల మొట్టమొదటి ఫ్లోరైడ్ టూత్‌పేస్ట్

U-BF 8/7 tel




యిల్లెగిరిపోయేలా కేకలువేస్తూవుంటే మాత్రం తుళ్ళిపడి రాగం లంకించుకుంటున్నాడు.

భర్తలో ఈ మార్పు రావటానికి కారణం యెంత ఆలోచించినా సీతకి అంతుబట్టలేదు. బాధని అమాయకంగా భరించడమే ఆమె వంతయింది. నిన్న మొన్నటివరకూ మామూలుగానే వున్నారు ... డబ్బుకి యిబ్బందివచ్చి ఏవయినా చికాకులు ఎదురయితే 'కష్టాలు మనుషులకొస్తాయి కానీ మానుల కొస్తాయా సీతా!' అని ధైర్యం చెప్పే మనిషి ఇంతలా యెందుకు కుంగిపోతున్నారో సీతకి బోధపడలేదు. ప్రతీ చిన్నవిషయానికీ వెర్రికేకలు వేస్తున్నారు. అంతలోనే దుఃఖం పట్టలేక చిన్నపిల్లాడిలా ఏడ్చేస్తున్నారు. అతను చెప్పలేని వేదనని అనుభవిస్తున్నట్టుగా మాత్రం సీత పోల్చుకోగలిగింది.

'ఏమండీ' పిలిచింది సీత. ఆలోచిస్తూ కళ్ళు మూసుకునివున్న సూర్యనారాయణ కళ్ళు తెరిచి చూసాడు.

'కాఫీ తీసుకోండి' అంటూ కాఫీ గ్లాసు టేబిలుమీద వుంచింది. తను వచ్చిన ఇంతసేపటికి కాఫీ తెచ్చియిచ్చిందంటే కాఫీపొడికోసం ఎవరింటికో పరిగెత్తిందన్నమాట. సూర్యనారాయణ బాధగా నిట్టూర్చాడు.

గ్లాసు అందుకుంటూ అడిగేడు 'కాఫీపొడి అయిపోయిందా సీతా?' ''ఊ'' సీత మౌనంగా బదులు పలికింది.

'పచారీ కొట్లోంచి తెప్పించలేకపోయావా?' సందేహిస్తూనే అడిగాడు సూర్యనారాయణ.

'కిందటి నెల బాకీ మనం పూర్తిగా చెల్లుబెట్టలేదనిచెప్పి ఈసారి అరువు అడిగితే లేదని చెప్పి పంపేస్తున్నాడండీ — రవిని పంపిస్తే పాత బాకీ రేపటిలోగా జమకడితేనే సరుకులిస్తానని చెప్పి తిరక్కొట్టాడు—'

సూర్యనారాయణకి కాఫీ గొంతు దిగలేదు. గుటకమింగి కాఫీ త్రాగడమయిందనిపించాడు. లేచి బట్టలు వేసుకుని వీధిలోకి బయలుదేరాడు.

పార్కులో కేశవరావు కలిశాడు. అతనూ సూర్యనారాయణ పని చేస్తున్న ఆఫీసులోనే పని చేస్తున్నాడు. ప్రస్తుతం పదిహేనురోజులుగా శలవులో వుంటున్నాడు. అతనే ముందు పలకరించాడు.

'శలవు పెట్టాశారేం?' ఏదో అడగాలన్నట్టుగా అడిగేడు సూర్యనారాయణ.

'మరే — నవల వ్రాయాలని శలవు పెట్టానండీ — పోటీ గడువు తేదీ ముగిసిపోతోందని శలవుకి అప్లై చేయాల్సివచ్చింది. నవల పూర్తి చేసి ఫేర్ కాపీ తీసి మొన్నటికి పంపించాను. సరిగ్గా గడువు పూర్తయేలోగా అందుతుంది!' అతని మాటల్లో కొంచెం తృప్తి, కొద్దిపాటి గర్వం ద్యోతకమవుతున్నాయి.

ఇద్దరూ పార్కులోకి దారితీసారు. కేశవరావు సిగరెట్టు ముట్టించి, సూర్యనారాయణ కొకటి యిచ్చాడు. సిగరెట్టు వెలిగించి గట్టిగా రెండు దమ్ములు లాగేడు సూర్యనారాయణ.

'ఎంతివ్వాలేమిటి నవల రాస్తే ?' అడిగేడు.

కేశవరావు కళ్ళూ భుజాలు ఎగరేసి మరీ జవాబు చెప్పాడు. 'ప్రైజు పేతే బాగా వస్తుం దండీ — మూడువేలవరకూ యిస్తారు — ఆర్డెనరీగా పబ్లిషయినా అయిదొందలు వరకూ యిస్తారు.'

సూర్యనారాయణకి నరాలు పీకినట్లయింది ! అబ్బ ! ఎంత పెద్ద మొత్తం ! మొత్తానికి కేశవరావు గట్టివాడే — నవలలూ అవీ రాసి బాగానే సంపాదిస్తున్నాడు.

లోగడ చాలా యేళ్ళ క్రిందట ఎవరి పెళ్ళి కోసమో గణాలూ అవీ కూడబలుక్కొని పంచరత్నాలు వ్రాసిపెట్టాడు తను ! ఆ మీదట వూర్లోకి ఓ పిల్లనటుడు వస్తే అతడ్ని పొగుడుతూ ఓ సన్మానపత్రం కూడా రాసేడు. అంతే ! తన రచనా వ్యాసంగం అంతటితో ఆగిపోయింది. అప్పటినుంచీ కృషి చేస్తే కేశవరావులాగే బాగా వ్రాయగలిగేవాడు కాడూ ! హుం... తనకా అదృష్టం వుండొద్దూ — తన జాతకం యిలా ఏడిసింది మరి !

'నవలల పోటీ గడువు ఎప్పటితో పూర్తవుతుం దన్నారు ?' సిగరెట్ విసిరేస్తూ అడిగాడు.

'ఇవాళకి వాళ్ళ ఆఫీసుకి చేరాలండీ...'

అయిపోయింది. ఆ గడువుకూడా తీరిపోయింది. అయినా తన వెర్రికాని — గడువు వుంటే మాత్రం తనేం వ్రాయగలడు, తన ముఖం !

గడువు... గడువు... ప్రతీదానికీ గడువే ! ఈ గడువుల సుడిగుండంలో మునిగి తేలడంతోనే సగం జీవితం హరించుకుపోతుంది !

తన జీవితంలో ఏదీ అనుకున్న సమయం లోపల సక్రమంగా నెరవేరిన గుర్తులేదు. తన నుదుటిరాత అలాంటిదిమరి.

అతనికి తన తల్లి గుర్తొచ్చింది ! అమ్మని హాస్పిటల్‌లో చేర్పినప్పుడేమయింది ? అమ్మకి యెంత వయసు వచ్చినా చాదస్తం మరింత ముదిరిందికానీ వదల్లేదు. ఆ వయసులో సీత యెంత వద్దని చెప్తున్నా వినకుండా అటకమీద నుంచి మడి ఆవకాయ దించాలని నిచ్చెన వేసుకుని ఎక్కింది. మీద మెట్టుమీంచి భళ్ళున జారి పడింది. ఒంటిమీద స్పృహ కోల్పోయింది. వెంటనే హాస్పటల్‌లో జాయిన్‌చేసాడు. తరువాత చాలారోజులు అలాగే వుండిపోయింది. అవేళ వొళ్ళెరుగని జ్వరం వచ్చింది. ఆ రాత్రి అమ్మ పరిస్థితి చాలా విషమంగా వుంది. డాక్టర్లు తెల్లవారేవరకూ గడువు పెట్టారు. ఆ రాత్రి గడిస్తే ముసలావిడ ప్రాణం నిలిచినట్టేనన్నారు. ప్రస్తుతానికి మరేం భయం వుండదన్నారు.

కాని ... రాత్రి గడిచింది. కానీ, అమ్మే దక్కలేదు. తెల్లవారకుండానే అమ్మ బతుకు తెల్లవారిపోయింది. ఛీ ! తను దురదృష్ట జాతకుడు. తనని వెంటాడే శనికి తనపట్ల జాలి లేదు.

సూర్యనారాయణ తల ఆలోచనలతో బరువెక్కిపోసాగింది. అతని సంగతి పరిచయమైనదే కనుక 'వస్తానండీ, పనుంది' అని జారుకున్నాడు.

చీకటిపడేవరకూ పార్కులోనే గడిపాడు సూర్యనారాయణ.

* * *

సూర్యనారాయణ రోజులు గడిచేకొద్దీ మరీ అదోమాదిరిగా తయారవసాగేడు. గడ్డం దట్టంగా పెరిగిపోయి మాసిపోయింది. ముఖం బాగా పీక్కుపోయింది. కళ్ళు కాంతివిహీనంగా తయారయాయి. మనిషి జీవచ్ఛవంలా వున్నాడు. అన్నం సరిగా తినటంలేదు. ఏమని అడిగితే సయించటంలేదంటాడు. రాత్రుళ్ళు సరిగా నిద్రపట్టక గింజుకుంటూవుంటాడు. మగత నిద్రలో ఎవరో కొట్టినట్టు తుళ్ళిపడుతూ వుంటాడు. ఇంటి విషయాన్ని దేన్నీ పట్టించుకోవడం మానేసాడు.

ఆఫీసుకి వారంరోజులు శలవు పెట్టేశాడు. అతని ఒంట్లో సుస్తీ ఏమిటో ఎవరికీ తెలీదు. డాక్టరు వచ్చి చూసి వెళ్ళాడు. ధైర్యంగా వుండమనీ, అనవసరమయిన ఆలోచనలతో మనసు పాడుచేసుకోవద్దనీ హెచ్చరించి వెళ్ళాడు.

తనతో చెప్పకుండా డాక్టర్ని పిలిపించినందుకు సీతమీద మండిపోయేడు సూర్యనారాయణ. తనకే రోగమూ లేదన్నాడు. వున్నా అది మందులతో నయమయ్యేది కాదన్నాడు. అతని కేకలు విని సీత కళ్ళలో నీళ్ళు పెట్టుకుంది. సూర్యనారాయణకి జాలి ముంచుకొచ్చింది. పిచ్చి సీత ! దానికేం తెలుస్తుంది తనున్న పరిస్థితి ! తను చెప్పందే తన ఆందోళన ఎలా గ్రహిస్తుంది పాపం ! దగ్గరకి పిలిచి 'వూరుకో సీతా ! ఏమిటో పిచ్చెత్తినట్టు ప్రవర్తిస్తున్నాను కదూ ?' అని ఓదార్చేడు.

భార్యని సముదాయించాడే కానీ సూర్యనారాయణకి మనసు స్థిమితంగా లేదు. పదే పదే రేకుపెట్టెలో బట్టల అడుగున వున్న ఉత్తరంలోని విషయాలే గుర్తొస్తున్నాయి. కేలండరువేపు చూసేడు. 'ఇంకా మూడు రోజులుంది !' అనుకుని బరువుగా నిట్టూర్చాడు. క్షణక్షణం అతనిలో నిరాశా నిస్పృహలు రెట్టింపవుతున్నాయి. ఆందోళన అధికమవుతోంది. నీరసంగా కళ్ళు మూసుకున్నాడు.

'సీతా ! వంట పూర్తయిందా' అంటూ వచ్చింది ఆ వీధి కొసని వుండే అనసూయమ్మ. ఆవిడ్ని ఆ వీధిలో ఆడవాళ్ళందరూ 'పిన్నీ' అని పిలుస్తారు. వాళ్ళకీ వీళ్ళకీ పనిపాటలలో సాయం చేస్తూ, జ్వరాలకీ, జలుబులకీ చిట్కా వైద్యం చెబుతూవుంటుంది. అందరి సమస్యలూ అడిగి తెలుసుకుంటూ ఉచిత సలహా పడేస్తూ వుంటుంది



రోజు కొక్కసారయినా వీధిలో అందర్నీ పలకరించి రానిదే ఆవిడకి కంటిమీద కునుకు పట్టదు.

లోపలకి వస్తున్నదల్లా సూర్యనారాయణని చూసి ఆగిపోయింది. సీత వంటింట్లోంచి వస్తూ ఆవిడని పిల్చుకుపోయింది ఇద్దరూ వెనక వసారాలోకి వెళ్ళిపోయేరు.

వాళ్ళ మాటలు సూర్యనారాయణకి వినిపిస్తూనే వున్నాయి. 'అవునూ, సీతా! మీ అమ్మాయికి ఎన్నో నెలన్నావు?' అడుగుతోంది అనసూయమ్మ. సీత చెప్పింది. 'అయ్యో! మరి పురిటికి తీసుకురావూ! ఈ నెల పోతే మూఢం వస్తుంది కదూ! ఆ తరువాత చుక్కెదురు కూడానూ' అంటోంది అనసూయమ్మ. 'ఆయన పరిస్థితి చూస్తే ఏం చెప్పడానికీ నోరు రావటం లేదు పిన్నీ' సీత గొంతు మరీ దీనంగా వినిపిస్తోంది.

'అలాగని వూరుకుంటే ఎలాగే తల్లీ! ఏదో చెప్పి వొప్పించాలిగానీ — ఇరవై దాటకుండా ఆ లోపల తీసుకురండి బావుండదు.'

సూర్యనారాయణ ప్రక్కకి తిరిగి ఒత్తిగిలి పడుకున్నాడు. అతని మనసంతా చికాగ్గా వుంది.

అనసూయమ్మ వెళ్లిపోయేక సీత గదిలోకి వచ్చింది. ఆమె గౌరిని పురిటికి తీసుకురావడం గురించి ప్రస్తావిస్తుందనుకున్నాడు సూర్యనారాయణ. కాని సీత ఆ విషయమే ఎత్తలేదు

ఆమె మనసు బాధతో వికలంగా వుంది. భర్త పరిస్థితి చూస్తూ చూస్తూ ఏ విషయం చెప్పడానికీ సాహసించలేకపోతోంది. ఉదయం రవి పరీక్ష ఫీజు వారంరోజుల్లోగా కట్టాలనీ లేకపోతే పరీక్షకి కూచోడం పడదనీ కళ్ళలో నీళ్ళు కుక్కుకుంటూ చెప్తూవుంటే తన గుండె తరుక్కుపోయింది. ఆయనని అడగడానికి ధైర్యంలేక తనతో చెప్పాడు...

'భోజనానికి లేవండి...'

'ఆకలిగాలేదు. మీరు తినండి' ముక్తసరిగా జవాబిచ్చేడు సూర్యనారాయణ. సీతకి దుఃఖం ముంచుకొచ్చింది.

* * *

రెండురోజులు గడిచాయి. ఆరోజు ఉదయం నుంచీ సూర్యనారాయణ మంచంమీద నుంచి లేవటంలేదు.

డాక్టరు వచ్చి ఏదో ఇంజక్షనుచేసి వెళ్లాడు. సూర్యనారాయణకి జ్వరంతో వొళ్ళు కాలిపోతోంది. నిద్రలోనే తుళ్ళిపడుతున్నాడు. మెలుకువవస్తే వెర్రిచూపులు చూస్తున్నాడు. నోటికొచ్చిన పద్యాలూ, శ్లోకాలూ చదివేస్తున్నాడు.

సీత బెంబేలెత్తిపోతోంది. వాళ్ళూ వీళ్ళూ వచ్చి ధైర్యం చెప్పారు. పిల్లలు యింట్లో ఓ మూలకి చేరి బిక్కుబిక్కుమని చూస్తున్నారు.

ఆ రాత్రంతా సీతకి కంటిమీద కునుకులేదు. గౌరికి పెర్రిగాం యివ్వాలో మానాలో తెలీక గాభరాపడసాగింది. భర్త మంచంమీద కూర్చుని అతని నుదుటిమీద తడిగుడ్డ వేసి నిమురుతూ గడిపింది. సూర్యనారాయణ అలా మూలుగుతూనే వున్నాడు. ఎడిరాత్రి దాటేక అతనికి నిద్రపట్టింది.

## గడువు

సీత మాత్రం అతన్ని కనిపెట్టుకుని కూర్చుని తెల్లవారుఝామున నిద్రలోకి జారిపోయింది.

* * *

సీతకి తెలివివచ్చి చూసేసరికి సూర్యనారాయణ మంచంమీద లేడు! 'ఏవండీ!' అని పిలుస్తూ గాభరాగా లేచింది.

సూర్యనారాయణ తన రేకుపెట్టె దగ్గర కూచునివున్నాడు. బట్టల అడుగునుంచి ఉత్తరం తీసాడు. 'సీతా! లేచావా! అగ్గిపెట్టె పట్టా' అన్నాడు సీతని చూస్తూ. సీత అతనివేపు తెల్లబోతూ చూసింది. భర్త గొంతులో నీరసం, తొట్రుపాటులేవు! అతని స్వరం ఉత్సాహంగావుంది!

యాంత్రికంగా అగ్గిపెట్టె తెచ్చియిచ్చింది. సూర్యనారాయణ చేతిలోని ఉత్తరాన్ని చింపి పోగులు పెట్టాడు. ఆ కాగితం ముక్కల్ని అగ్గిపుల్ల గీసి మంట పెట్టాడు. సీత కంతా అయోమయంగా వుంది. ఆయన మాత్రం ఉల్లాసంగా వున్నట్టు కనిపిస్తున్నారు. అదే చాలు తనకి! రవీంద్ర, కాంతి తండ్రి ప్రవర్తనని వింతగా చూస్తున్నారు.

'జ్వరం ఎలా వుందండీ' సీత తెప్పరిల్లి అడిగింది.

## త్వరలో
## నళిని
## సీరియల్

సూర్యనారాయణ హాయిగా నవ్వేడు 'జ్వరం?! ఉఫ్! — ఎగిరిపోయింది సీతా! నా కిప్పుడేంలేదు వొంట్లో — హాయిగా వుంది ప్రాణానికి' నవ్వుతూ అన్నాడు. 'హమ్మయ్య' నిట్టూర్చింది సీత.

'వంట రెడీ చెయ్యి సీతా! ఆఫీసుకెళ్తానివాళ'

'నీరసంగా లేదూ?' సీత ఆశ్చర్యపోతూ అడిగింది.

'కొంచెం నీరసంగా వుందనుకో — అయినా ఫరవాలేదు — రిక్షామీద వెళ్లొచ్చేస్తాను —' సీతకి ఏదో అడగాలనిపించింది. కానీ అతనే చెప్తాడని వూరుకుంది.

ఆ తరువాత సూర్యనారాయణ ఉల్లాసంగా కాలకృత్యాలన్నీ తీర్చుకున్నాడు. సీత కూడా పట్టరాని ఆనందంతో తలమునకలవుతూ వంట పనులు ప్రారంభించింది.

ఆ ఉదయం పిల్లల్ని ముగ్గుర్నీ దగ్గర కూచోబెట్టుకుని సరదాగా కబుర్లు చెప్పాడు సూర్యనారాయణ. చాలా రోజుల తరువాత తండ్రి ముఖంలో సంతోషరేఖలు చూసి రవికి ధైర్యం వచ్చింది. పరీక్ష ఫీజు సంగతి కదిపాడు. 'ఓ! దాన్దేముందిరా కట్టేద్దాం' ధైర్యం చెప్పాడు సూర్యనారాయణ.

స్వయంగా బజారుకెళ్ళి దుకాణంవాడికి నచ్చచెప్పి యింట్లోకి సరుకులు కొనితెచ్చాడు.

తొమ్మిది దాటేక భోజనానికి కూర్చుని సుష్టుగా కడుపునిండా తిన్నాడు. చూస్తూ వడ్డిస్తున్న సీతకి కడుపు నిండిపోయినట్లయింది. తృప్తిగా నిట్టూర్చింది. గౌరిని పురిటికి తీసుకువచ్చే విషయం గుర్తొచ్చింది. ఆ విషయం భర్తతో చెప్పింది

'అవును సీతా! అనసూయమ్మగారు అంటూవుంటే నేనూ విన్నాను — ఎవర్నయినా అడిగి డబ్బు తెస్తాను. మూఢం రాకుండానే అమ్మాయిని తీసుకొచ్చేద్దాం' అని నిబ్బరంగా చెప్పాడు సూర్యనారాయణ.

సీతకి యిదంతా కలా నిజమా అనిపించింది. నిన్నటివరకూ ఏ విషయం పట్టించుకోకుండా పిచ్చెత్తిన మనిషిలా ప్రవర్తించిన మనిషిలో ఎంత మార్పు వచ్చింది! ఇవాళెంత హాయిగా నిండుగా వుంది! సీత తేలికగా నిట్టూర్చింది.

సూర్యనారాయణ బట్టలు వేసుకుని ఆఫీసుకి బయలుదేరాడు. చంటివాడ్ని ముద్దుపెట్టుకుని సీతకి వస్తానని చెప్పి వీధిలోని కొచ్చేడు.

అతను మెట్లు దిగబోతూవుండగా సీత 'ఏమండీ—మాట' అని పిలిచింది. సూర్యనారాయణ ఆగి, భార్య ముఖంలోకి చూసాడు. 'మీరు కాల్చి మసిచేసిన ఉత్తరం ఏమిటో చెప్పరూ?' అనడిగింది సీత.

సూర్యనారాయణకి నవ్వొచ్చింది!

సరిగ్గా మూడ్నెల్ల క్రిందట ఏదో పత్రికలో 'పువ్వు మీ జాతకఫలం చెప్పును' అనే ప్రకటన చూసేడు తను. తనకి జాతకాల పిచ్చి జాస్తి. ఓ పువ్వు పేరు, తన పుట్టిన తేదీ వివరాలతోసహా ఆ బెంగుళూరు అడ్రసుకి అయిదురూపాయలు ఎమ్. ఓ. చేసాడు. వారం తిరక్కముందే ఉత్తరం వచ్చింది. ''మీ జాతకరీత్యా మీకు మీ నలభై ఒకటో యేట — అంటే ఈ యేడాది గొప్ప ప్రాణగండం సంభవించబోతూంది. మా కార్యాంతికులు ఈ విషయాన్ని నిర్ధారించేరు. రానున్న డిశంబరు పదిహేనవతేదీ నాటికి శని మిమ్మల్ని ఏదోరూపేణా కబళించబోతోంది. అది జ్వరం కావచ్చు. యాక్సిడెంటు కావచ్చు. కాని తప్పదు. అయితే— గ్రహగతుల్ని మీకు అనుకూలంగా మార్చడానికి మీ జ్యోతిషచక్రం క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి మా విఖ్యాతిగాంచిన దైవజ్ఞులు చెప్తున్నారు. మీ పేర నవగ్రహ పూజలూ, ఉపాసనా జరిపించాలి. గ్రహశాంతి చేయిస్తాం. ఫలితాలు మీకు తెలియబరుస్తూవుంటాం. పదిరోజుల్లోగా ఆ ఖర్చుల నిమిత్తం మూడువందలు పంపించండి. ఆ తరువాత పంపినా ఫలితం వుండదు. మీ భవిష్యత్తు, ఆయువు మీ చేతిలో వున్నాయి. ఆలోచించుకోండి — మీకు శుభం కలుగుగాక!'' అని వుంది అందులో — ఎంత ప్రయత్నించినా డబ్బు పంపించలేకపోయాడు తను.

'ఏమండీ...' పిలుస్తోంది సీత.

ఆలోచనల్లో నుంచి తేరుకున్నాడు. సీత కిదంతా ఏమని చెప్తాడు?!

''ఏం లేదు సీతా! కొన్ని కొన్ని పిచ్చినమ్మకాలు మనుష్ని ఎలా క్రుంగదీస్తాయో, నిర్వీర్యం చేస్తాయో ఇప్పుడే తెలుసుకున్నాను — నా కళ్ళు యిప్పుడే తెరుచుకున్నాయి — ఇవాళే మళ్ళీ మామూలు మనిషినయ్యాను!'' అనేసి నవ్వుతూ వీధి మెట్లు దిగి పోయేడు సూర్యనారాయణ!